ఏటా ముంపు ముప్పు..
వానొస్తే బిక్కుబిక్కు

మండలంలోని మెలిపాక, చూచుకొండ, గణపర్తి, యాదగిరిపాలెం, పల్లపు ఆనందపురం తదితర గ్రామాల ప్రజలు వర్షాకాలంలో నిద్రలేని రాత్రులు గడపాల్సిందే. వర్షాల తీవ్రత పెరగడం అది వరదగా మారడం, పంటలు ముంపునకు గురవడం, ఇళ్లలోకి వరదనీరు వచ్చి చేరడం పరిపాటిగా మారింది. సీఎం చంద్రబాబు గతంలో ప్రతిపక్ష నేతగా ఉండగా ఇక్కడ ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. ఇక్కడ ముంపు సమస్య లేకుండా చూడడంతో పాటు జీ ప్లస్ వన్ పథకం కింద ఇళ్లు మంజూరు చేస్తానంటూ హామీ ఇచ్చారు. ఇపుడు అధికారం చేపట్టిన చంద్రబాబు నాడు ఇచ్చిన హామీని నెరవేర్చాలని ప్రజలు కోరుతున్నారు.

- లోతట్టు ప్రాంత వాసుల ఆవేదన
- సమస్య శాశ్వత పరిష్కారానికి నాడు ప్రతిపక్ష నేతగా చంద్రబాబు వాగ్దానం
- హామీ నెరవేర్చాలని ప్రజల ఎదురుచూపులు


మెలిపాకలో ముంపునకు గురైన పంట (ఫైల్)

మునగపాక : మండలంలో ఏటా ఎగువన భారీ వర్షాలు కురిస్తే శారదానది మీదుగా భారీ వరదనీరు వచ్చి చేరుతుంది. దీంతో లోతట్టు గ్రామాల ప్రజల ఇళ్లల్లోకి సైతం వర దనీరు వచ్చేస్తుంది. రోజుల తరబడి నీరు నిలిచిపోతుంది. వేలాది ఎకరాల్లో పంటలు కూడా దెబ్బతినే పరిస్థితులు నెలకొంటాయి. దీనికి తోడు చూచుకొండ-గణపర్తి గ్రామాల మధ్య రోలుగెడ్డపై బ్రిడ్జి లోతట్టుగా ఉండడంతో ఈ మార్గం గుండా రాకపోకలకు ఇబ్బంది ఎదురవుతుంది.

బాబూ నాటి హామీ గుర్తుందా?

అక్టోబర్ 23, 2013లో సంభవించిన నైలాన్ తుపానుకు లోతట్టు ప్రాంతాలు మునిగిపోయాయి. ముంపు ప్రాంతాల పర్యటనలో భాగంగా ప్రతిపక్ష నేత హోదాలో చంద్రబాబు ఈ ప్రాంతానికి వచ్చి తాను అధికారంలోకి వస్తే జీ ప్లస్ వన్ పథకం కింద ఇళ్లు నిర్మించడంతో పాటు సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. 2014లో సంభవించిన హుద్‌హూద్ తుపాను సందర్భంగా చంద్రబాబు ముఖ్యమంత్రి హోదాలో మునగపాకలో పర్యటించి పశువుల పాకలు దెబ్బతినడాన్ని చూసి ప్రతి పాకకు రూ.10వేలు ఇస్తానంటూ హామీ ఇచ్చారు. ఆ హామీలు నెరవేర్చాలని జనం కోరుతున్నారు.


చూచుకొండ-గణపర్తి బ్రిడ్జిపై ప్రవహిస్తున్న వరదనీరు(ఫైల్)

శాశ్వత పరిష్కారం అవసరం



ముంపు సమస్య పరిష్కారానికి నోచుకోలేదు. నేతల హామీలు అమలుకు నోచుకోలేదు. వర్షాకాలం వస్తే చాలు ముంపు ప్రాంత ప్రజలు భయాందోళనకు గురికావాల్సిందే. వరద సమయంలో ఇళ్లల్లోకి వచ్చిన నీరు రోజుల తరబడి పోయే పరిస్థితులు కనిపించవు. సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– గుంట్ల అప్పారావు, దళితకాలనీ, మెలిపాక

హామీ నెరవేర్చాలి



నైలాన్ తుపాన్ సమయంలో ప్రతిపక్ష నేత హోదాలో చంద్రబాబు ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. తాము అధికారంలోకి వస్తే ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామంటూ హామీ ఇచ్చారు. జీ ప్లస్ వన్ పథకం కింద ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. ఆ హామీలు నెరవేర్చాలి.

–కాండ్రేగుల కిరణ్‌కుమార్, రైతు, చూచుకొండ

ఉన్నతాధికారులకు నివేదిస్తాం..



ముంపు ప్రాంతాల ప్రజల సమస్యలను ఉన్నతాధికారులకు నివేదిస్తాం. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగు చర్యలు తీసుకుంటున్నాం. ముంపు ప్రాంతాల్లో అధికారులు అందుబాటులో ఉంటున్నారు. ప్రజలు కూడా అధికారులకు సహకరించాలి.

–పి.పాపారావు, తహసీల్దార్, మునగపాక

క్లుప్తంగా

రైతు సంఘ ప్రతినిధుల సందర్శన


నీట మునిగిన వరినారు మడుల వివరాలు సేకరిస్తున్న రైతు సంఘ ప్రతినిధులు

మునగపాక: ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న వరినారు మడులను మంగళవారం మునగపాక రైతు సంఘ ప్రతినిధులు పరిశీలించారు. సంఘ అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఆడారి మహేష్, దాడి శివ మాట్లాడుతూ నారుమడుల ముంపు వివరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు.

డిప్యూటీ డీఈవో ఆకస్మిక తనిఖీ


విద్యార్థులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈవో అప్పారావు

ఎస్.రాయవరం : సైతారుపేట ఉన్నత పాఠశాలలో యలమంచిలి డిప్యూటీ డీఈవో పి.అప్పారావు మంగళవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. విద్యార్థుల వర్క్ బుక్స్ తనిఖీ చేసి , బోధన తీరుపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం వంటకాలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

పారిశుధ్య చర్యలపై ఆరా

పాయకరావుపేట : పాయకరావుపేట, నామవరం, గుంటపల్లి, సత్యవరం గ్రామ సచివాలయాల పరిధిలో పారిశుధ్య పనులను అధికారులు మంగళవారం పరిశీలించారు. సచివాలయ సిబ్బంది సకాలంలో ఉద్యోగ విధులకు హాజరు కావాలని, ప్రభుత్వం అప్పగించిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఈవోఆర్‌డీ చంద్రశేఖర్ ఆదేశించారు. సీజనల్ వ్యాధులు రాకుండా ప్రజలందరికీ అవగాహన కల్పించాలని సూచించారు.

కాల్వల్లో పూడిక తొలగింపు

మునగపాక:అరబుపాలెం గ్రామంలో సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు అన్నారు. గ్రామంలోని కాలువల్లో పేరుకుపోయిన పూడికను మంగళవారం పొక్లెయిన్ సాయంతో తొలగించే పనులకు ఆయన శ్రీకారం చుట్టారు. వర్షాలు కురుస్తున్నందున ప్రజలకు ఎటువంటి అనారోగ్యం సంభవించకుండా ఉండేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామని శ్రీనివాసరావు తెలిపారు.

కూలీలకు వేతనాలు చెల్లించాలి

మునగపాక : పెండింగ్‌లో ఉన్న బకాయి వేతనాలు చెల్లించాలని కోరుతూ మంగళవారం తోటాడ, టి.సిరసపల్లి సచివాలయాల వద్ద ఉపాధి హామీ పథకం కూలీలు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కోశాధికారి వీవీ శ్రీనివాసరావు మాట్లాడుతూ గత పది వారాలుగా కూలీలకు వేతనాలు అందలేదన్నారు. దీంతో కూలీలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సంబంధిత అధికారులు బకాయిలు విడుదల చేసి ఆదుకోవాలన్నారు. లేకుంటే ఉపాధిహామీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కూలీలకు న్యాయం చేయాలని కోరుతూ ఆయా కార్యదర్శులు మోహిని, లక్ష్మీనారాయణలకు వినతి అందజేశారు. వ్యవసాయ కార్మిక సంఘ నాయకుడు ఆళ్ల మహేశ్వరరావు, కూలీలు పార్వతి, బొడ్డేటి ధనలక్ష్మి, వెంకటలక్ష్మి, అన్నపూర్ణ ఆందోళనలో పాల్గొన్నారు.

గంగాలమ్మతల్లి గుడికి విరాళం


గుడికి రూ 50,116 విరాళం అందజేస్తున్న రవికుమార్ దంపతులు

మునగపాక : మూలపేటలో నిర్మిస్తున్న గంగాలమ్మతల్లి గుడి నిర్మాణానికి దాతలు ముందుకొచ్చి సహాయం అందజేస్తున్నారు. ఇదే గ్రామానికి చెందిన బొడ్డేడ నరసింగరావు జ్ఞాపకార్థం భార్య మణి, కుమారుడు రవికుమార్-కల్యాణి రూ.50,116 నగదు విరాళంగా ఆలయ నిర్వాహకులకు అందజేశారు. సర్పంచ్ గంగప్పలనాయుడు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సాగుదార్లకు నష్టపరిహారం చెల్లించాలి

కలెక్టర్‌ను కోరిన రైతులు


కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న వీసం తదితరులు

నక్కపల్లి : మండలంలో చందనాడ గ్రామంలో దళితులు సాగుచేసుకుంటున్న డీఫారం భూములను ఏపీఐఐసీ సేకరించిందని, వీరందరికీ నష్టపరిహారం చెల్లించాలని పలువురు రైతులు జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్‌కు వినతిపత్రం ఇచ్చారు. మంగళవారం వీరంతా రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, సర్పంచ్ తళ్ల భార్గవ్, ఎంపీటీసీ గంటా తిరుపతిరావుల ఆధ్వర్యంలో కలెక్టర్‌ను కలిసారు. సర్వే నెంబరు120, 135,138 తదితర నంబర్లలో ఉన్న ప్రభుత్వ భూమిని 1970లో అప్పటి ప్రభుత్వం గ్రామానికి చెందిన దళితులకు, కొంత మంది పేదలకు డీఫారం పట్టాలు ఇచ్చిందన్నారు. ఈ భూములను నలభై ఏళ్లుగా వారే సాగు చేసుకుంటున్నారన్నారు. ఇటీవల కాలంలో కొంతమంది పెట్టుబడులు పెట్టలేక కొర్నిగా వదిలేసిన సందర్భాలు ఉన్నాయన్నారు. ఈ భూములను ఇండస్ట్రియల్ కారిడార్ కోసం ఏపీఐఐసీ వారు సేకరించారన్నారు. పట్టాలు పొందిన రైతులకు నష్టపరిహారం ఇవ్వలేదన్నారు. ఈ భూములపై ఆధారపడ్డ వారందరికీ ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని కోరారు. సాగుదార్లలో ఎక్కువ మంది దళితులు ఉన్నారన్నారు. వీరి ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని నష్టపరిహారం చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు అప్పలస్వామి పాల్గొన్నారు.

ఏడు ముళ్ల ఆనకట్టపై దృష్టి సారించాలి

రాంబిల్లి (యలమంచిలి) : మండలంలో ఏడు ముళ్ల ఆనకట్ట నిర్మాణంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జి.దేవుడునాయుడు కోరారు. మంగళవారం రాంబిల్లి మండలంలో నీట మునిగిన వరి నారుమడులను రైతు సంఘం నాయకులు, కార్మికసంఘం నాయకులతో కలసి సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాలకు వరినారు మడులు ముంపునకు గురైన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు రైతులు ఇప్పటికే వేసిన వరినారు నీట మునిగి పనికి రాకుండా పోయిందని రైతులు ఆందోళన చెందుతున్నారని రాంబిల్లి మండలంలో సుమారుగా 10వేల ఎకరాల వరకు రైతులు వరి పండిస్తున్నారని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆర్‌బీకేల ద్వారా మెరుగైన విత్తనాలు అందించాలని, రైతులకు పెట్టుబడి సాయంగా అందిస్తానన్న రూ.20వేల రైతు భరోసా కౌలు రైతులకు అందించాలని కోరారు. కార్యక్రమంలో ఆయన వెంట రైతు సంఘం నాయకులు వై. శ్రీనివాసరావు, కార్మిక సంఘం నాయకులు బి.అప్పారావు, కె.వెంకటరమణ, వై.రాము, అప్పలనాయుడు పాల్గొన్నారు.

అనుమతుల్లేని లేఅవుట్లపై ఫిర్యాదు

అచ్యుతాపురం (మునగపాక): పంచాయతీ అనుమతులు లేకుండా లే-అవుట్‌లు వేసి జరుగుతున్న అమ్మకాలు, రిజిస్ట్రేషన్లు నిలుపుదల చేయాలని పూడిమడకకు చెందిన ఎరిపల్లి కాసులు అనకాపల్లి జిల్లా రిజిస్ట్రార్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. అచ్యుతాపురం మండలం పూడిమడక పంచాయతీలో కొంతమంది ప్రయివేటు వ్యక్తులు పంచాయతీ అనుమతులు తీసుకోకుండా లే-అవుట్‌లు వేసి నిర్మాణాలు చేస్తున్నారన్నారు. ఈ విషయమై గ్రామస్తులు ఇటీవల జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం, వెంటనే జిల్లా పంచాయతీ అధికారి విచారణ చేపట్టడం జరిగిందన్నారు. అయినప్పటికీ కొంతమంది విచారణ విషయాన్ని దాచిపెట్టి ప్లాట్లు రిజిస్ట్రేషన్లు చేస్తున్నారన్నారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి ప్లాట్ల రిజిస్ట్రేషన్లు జరగకుండా యలమంచిలి రిజిస్ట్రేషన్ కార్యాలయానికి ఆదేశాలు జారీ చేయాలని కాసులు కోరారు.

ఏకాగ్రతతో చదువుకోవాలి

మునగపాక : విద్యార్థులు ఏకాగ్రతతో చదువుకొని మంచి ఫలితాలు సాధించాలని ఎంఈవో-2 బుద్ద శివనాయుడు కోరారు.తిమ్మరాజుపేట హైస్కూల్‌ను ఆయన మంగళవారం సందర్శించారు. విద్యార్థుల హాజరుశాతం అలాగే పుస్తకాలను పరిశీలించారు. శిక్షా సప్తాహ కార్యక్రమంలో భాగంగా పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. బోధన ప్రదర్శనను గుర్తించి అభినందించారు. స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం గాలి అప్పారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాడ్రాపల్లిలో ఉచిత వైద్య శిబిరం

మునగపాక: సీజన్‌లో ప్రతీ ఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు వహించాలని ఆర్‌కే ఆసుపత్రి వైద్య నిపుణుడు నాయుడు బాబు కోరారు. మండలంలోని వాడ్రాపల్లిలో ఆర్‌కే ఆసుపత్రి సౌజన్యంతో సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. రోగులను డాక్టర్ నాయుడు బాబు, కో-ఆర్డినేటర్ పి.వేణులు పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు.

వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్‌పై అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా యువజన సర్వీసుల శాఖ మేనేజర్ వెంకటేష్

యలమంచిలి రూరల్ : మంచి ఆలోచనలు, నిశ్చలమైన మనస్సు విద్యార్థుల విజయానికి సోపానాలని జిల్లా యువజన సర్వీసుల శాఖ మేనేజర్ ఎస్.వెంకటేష్ అన్నారు. పట్టణంలోని గీతాంజలి, ఉషోదయ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో మంగళవారం విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్‌పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ప్రణాళిక ప్రకారం చదువుతూ ఉద్యోగావకాశాలు పొందడానికి అవసరమైన నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు.

వేలాడుతున్న యమపాశాలు


మునగపాకలో విద్యుత్ స్తంభం చుట్టూ పిచ్చిమొక్కలు


గణపర్తిలో ఇంటి సమీపం నుంచి వెళుతున్న వైర్లు

మునగపాక : మండలంలోని పలు చోట్ల విద్యుత్ స్తంభాలు, అలాగే వైర్లు యమపాశాలుగా దర్శనమిస్తున్నాయి. దీంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. వర్షాకాలం కావడంతో ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. మునగపాకలోని నందీశ్వర ప్రాంగణం దరి పాన్‌షాప్ పక్కనే విద్యుత్ స్తంభం చుట్టూ పిచ్చి మొక్కలు పేరుకుపోతున్నాయి. దీనికి తోడు వైర్లపైకి మొక్కలు పాకేస్తున్నాయి. అలాగే గణపర్తిలో ఇంటిపక్కగా విద్యుత్ వైర్లు వెళుతున్నాయి. చేయి చాపితే వైర్లు షాక్ కొట్టేలా కనిపిస్తున్నాయి. గత ఏడాది వైర్ల కారణంగా ఒకరు మృత్యువాతకు గురయ్యారు. ఈ విషయమై అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఉత్సాహంగా 'శిక్షా సప్తాహ్'


బోడపాలెం ఎంపీయూపీ స్కూల్‌లో బోధనా సామగ్రి ప్రదర్శన

కోటవురట్ల: బోడపాలెం ఎంపీయూపీ స్కూల్‌లో శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని మంగళవారం ఉత్సాహంగా నిర్వహించారు. బోధనా సామగ్రిని ప్రదర్శించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యా వారోత్సవాలలో భాగంగా పునాది అభ్యసన, సంఖ్యాశాస్త్రం , నైపుణ్యాల అభివృద్ధిపై అవగాహన కల్పిస్తామని హెచ్‌ఎం ఎ.శ్రీనివాసబాబు తెలిపారు.

ఎస్.రాయవరం: శిక్షా సప్తాహ స్థానిక వనరులపై బోధన సామాగ్రిని ప్రదర్శన చేశారు. గుడివాడ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యాశాఖ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు పీడీ కుందూరు రాజు తెలిపారు. ఉపాధ్యాయుల సూచనలు మేరకు విద్యార్థులు పలు రకాల నమూనాలు ప్రదర్శించారు. ఇన్‌చార్జ్ హెచ్‌ఎం మహేశ్వరి పాల్గొన్నారు.

యలమంచిలి రూరల్ : జంపపాలెం ఉన్నత పాఠశాలలో మంగళవారం శిక్షా సప్తాహ్ ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో బోధనాభ్యాసన సామగ్రి మేళా ఏర్పాటు చేశారు. హెచ్‌ఎం ఏవీహెచ్ శాస్త్రి, సుబ్బారావు, రమణ అప్పలనాయుడు, పాఠశాల కమిటీ పాలకవర్గ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా బీఎంఎస్ దినోత్సవం

రాంబిల్లి (యలమంచిలి) : భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) 70వ దినోత్సవాన్ని రాంబిల్లి మండల కేంద్రంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. బీఎంఎస్ 70వ దినోత్సవం పురస్కరించుకొని సంఘ్ జెండాను మజ్దూర్ సంఘ్ సభ్యులు, ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘ్ అఖిల భారత ఉపాధ్యక్షుడు మళ్ల జగదీశ్వరరావు, రాష్ట్ర కోశాధికారి లాలం ప్రసాద్ మాట్లాడుతూ నేడు భారతీయ మజ్దూర్ సంఘ్ దేశవ్యాప్తంగా ప్రారంభించి 70 సంవత్సరాలైందని బీఎంఎస్ దేశ హితం, కార్మిక హితం, పరిశ్రమ హితంగా పరిశ్రమలను కార్మికులతో, దేశాన్ని పరిశ్రమలతో నింపాలి అనే నినాదంతో పని చేస్తుందని పేర్కొన్నారు. కార్మికులందరూ బీఎంఎస్ చేరి సంస్థ బలోపేతానికి తోడ్పాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ బొట్టా రమణ,మండల కార్యదర్శి కె.నూకరాజు, సిహెచ్ గగన్, కోదండరావు, రాముడు పాల్గొన్నారు.

సాగునీటి కాల్వ ఆక్రమణల తొలగింపు

మునగపాక : మెయిన్ రోడ్డును ఆనుకొని ఉన్న సాగునీటి కాలువల్లో వేసిన పైప్‌లను తొలగించి సాగునీటికి అంతరాయం లేకుండా చూడాలని పలువురు రైతులు తహసీల్దార్ పాపారావు దృష్టికి తీసుకురావడంతో ఆయన స్పందించారు. కొందరు లే-అవుట్‌ల ఏర్పాటులో భాగంగా కప్పేసిన కాలువలను పొక్లెయిన్ ద్వారా తొలగించే పనులు చేపట్టారు.

వైద్య బృందం సందర్శన

పాయకరావుపేట : పట్టణంలోని సచివాలయం -1 పరిధిలో గల లోతట్టు ప్రాంతం పాత హరిజన వాడను వైద్యాధికారి డాక్టర్ డి.సుభాష్, వైద్య బృందం సందర్శించారు. వర్షాల కారణంగా నీరు కలుషితమై అతిసార వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, దోమలు నివారించి డెంగ్యూ వంటి వ్యాధులు సోకకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అవగాహన కల్పించారు.

నీటి ముంపులోనే వరి నారుమడులు


కొత్తూరు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న శారదానది

- ఉధృతంగా శారదానది
- క్షేత్రస్థాయిలో అధికారుల పర్యటనలు
- అన్నదాతల్లో ఆందోళన


భోగాపురం వద్ద నేలకొరిగిన విద్యుత్ స్తంభాలను సరి చేస్తున్న విద్యుత్ సిబ్బంది


పంట పొలాలను పరిశీలించి రైతులకు సూచలిస్తున్న వ్యవసాయాధికారులు

రాంబిల్లి (యలమంచిలి) : ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలో మేజర్ శారద , మైనర్ శారదా నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. నదుల్లో నీరు పంట కాలువల ద్వారా విస్తారంగా ప్రవాహించడం, కొన్ని రోజులుగా ఏకధాటిగా కురిసిన వర్షానికి పల్లపు ప్రాంతాల్లో వరి నారుమడులు నీటి ముంపునకు గురయ్యాయి. రాంబిల్లి మండల వ్యాప్తంగా శారదా దిగువ, ఎగువన అనుకొని ఉన్న పంట పొలాల్లోకి వర్షం నీరు పుష్కలంగా చేరి దమ్ములకు అనువుగా మారింది. కొన్ని రోజులుగా వరి నారుమడులు సిద్ధం చేసుకొని తీరా వరి నాట్లు వేసే సమయానికి వానలు ముంచెత్తడంతో నారు మడులు నీట మునిగాయి. దీంతో రైతులు నీరు బయటకి తొలగించే పనుల్లో నిమగ్నమై ఉన్నారు.

మరో పక్క మండలంలో ముంపునకు గురయిన పంటపొలాలను వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు బృందంతో కలసి పరిశీలించి నారు సంరక్షణ చర్యలు సూచిస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు సకాలంలో ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే రైతు భరోసా వచ్చేదని, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో రైతు భరోసా అందక ఇబ్బందులు పడుతున్నామని పలువురు రైతులు వాపోతున్నారు.

మునగపాక: మండలంలో గత అయిదురోజులుగా కురిసిన వర్షాలకు నారుమడుల్లో నీరు నిలిచిపోయింది. విత్తనాలను కొనుగోలు చేసి నారుమడులు వేసుకున్నా కాలం కలిసి రాలేదని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు. ముంపునకు గురైన వరి నారు మడుల్లో నీరు బయటకు పోయేలా చర్యలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

రాంబిల్లి (యలమంచిలి) : మండలం పంచదార్లకట్టుబోలు తదితరగ్రామాల్లో మండల వ్యవసాయాధికారిణి సిబ్బందితో కలసి పర్యటించి ముంపునకు గురయిన నారుమడులు వివిధ రకాల అంతర పంటలను ఆమె అధికారులు రైతులతో కలసి పరిశీలించారు.

నారు సంరక్షణపై సూచనలిచ్చాం

వర్షాలకు నారుమడిలో చేరిన నీటిని తీసివేయాలి. తరువాత యూరియా, మ్యూరేట్ ఆఫ్ పోటాష్ నారుమడులకు ఎరువులుగా వేసుకోవాలి. తెగుళ్లు ఆశించకుండా కార్బన్డిజం ఒక గ్రాము, లేదా మ్యాన్కోజబ్ మూడు గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. వరి నారు మొలక దశలో నీట మునిగి పాడైనట్టయితే వెంటనే సంబంధిత వ్యవసాయాధికారులను రైతు లు సంప్రదించాలి. పాడ తెగులు సోకకుండా కలుపు తీసి సస్య రక్షణ చేపట్టాలి. వరి నారుమడులు దెబ్బతింటే ప్రభుత్వం ద్వారా విత్తనాలు, ఎరువులు అందజేయడం జరుగుతుంది.


– సి.సమంత, మండల వ్యవసాయాధికారి, రాంబిల్లి

నీటి ముంపులోనే...

అకాల వర్షంతో నాట్లు వేసే సమయానికి ఏపుగా వచ్చిన వరి నారుమడులు నీట మునిగాయి. నేను పీజీ చదివినా వ్యవసాయంపై మక్కువతో ఎకరంన్నర పొలం కౌలుకు తీసుకొని వరి పంట వేయడానికి సిద్ధపడ్డాను. నారు మడిలో నీరు అధికంగా చేరడం వల్ల మొక్క దశలోనే కుల్లిపోతుందనే ఆందోళన కలుగుతుంది. వ్యవసాయాధికారుల సూచనలతో జాగ్రత్తలు తీసుకుంటున్నాను. ఈ ఏడాది ఖరీఫ్ మొదటిలోనే నారుమడులు నీట మునగడం వల్ల పంటలు వేయడానికి కొంత మేర ఆలస్యం కావచ్చు. నారుమడులు దెబ్బతిన్న రైతులకు విత్తనాలు,ఎరువులు అందజేసి ప్రభుత్వం ఆదుకోవాలి.

– పల్లా సతీష్, యువ రైతు, హరిపురం గ్రామం

జెడ్పీటీసీ సభ్యునికి నేతల పరామర్శ


జెడ్పీటీసీ లంక సూరిబాబును పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పాయకరావుపేట : జెడ్పీటీసీ లంక సూరిబాబును మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు చిక్కాల రామారావు పరామర్శించారు. సూరిబాబు అనారోగ్యం కారణంగా తునిలో ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ సందర్భంగా చిక్కాలతో పాటు జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, మాసాహెబుపేట సర్పంచ్ గెడ్డమూరి నీలవేణి శ్రీనివాసరావు, ఎంపీటీసీ కొంతం నరేష్, పాయకరావుపేట ఉప సర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యులు కాధా రామకృష్ణ, కేశనకుర్తి సత్తిబాబు, తదితరులు సూరిబాబును పరామర్శించి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు.